క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న రీచ్ సంస్థ సభ్యులు

సీటీఆర్ఐ: టీబీ రోగులకు రీచ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా కేంద్రీకృత పోషకాహారం పంపిణీ చేసినట్టు జిల్లా ప్రోగ్రాం అధికారి వర్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 12 మందికి హిందుస్థాన్ యూనిలివర్ ఆర్థిక సాయంతో రీచ్ సంస్థ ద్వారా పౌష్టికాహారం అందజేశారు. వర్మ మాట్లాడుతూ జిల్లాలోని 8 టీబీ యూనిట్లకు పౌష్టికాహారం అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ హారిక, సత్యనారాయణ, రీచ్ సిబ్బంది అనిల్, అను ప్రసన్న పాల్గొన్నారు.

ప్రజల కోసం సీపీఐ నిరంతర పోరాటం

ప్రకాశం నగర్: ప్రజల పక్షాల సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం, కూరగాయల మార్కెట్, అపరాల మార్కెట్, కొత్తపేట, క్వారీ ఏరియా సెంటర్లలో గురువారం సీపీఐ శత వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీని 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో స్థాపించారన్నారు. నేడు బీజేపీ ప్రభుత్వం మతోన్మాద నినాదంతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని విమర్శించారు. జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి నాయకులు.. పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామన్నారన్నారు. అయితే ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని తమ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. విద్యుత్ చార్జీల రూపంలో రూ.15,484 కోట్ల భారాన్ని ప్రజలపై ప్రభుత్వం మోపిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ, నగర కార్యవర్గ సభ్యులు నల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.


కరెన్సీ నోట్లతో మహాలక్ష్మికి అలంకరణ



కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు

సీటీఆర్ఐ: గాడాల గ్రామంలోని చిన్న వెంకటేశ్వరస్వామి పీఠంలో కొలువైన శ్రీమహాలక్ష్మి అమ్మవారిని గురువారం కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు మాట్లాడుతూ భక్తులకు సిరులు ప్రసాదించే అమ్మవారిని దర్శించుకుంటే సకల సంపదలు కలుగుతాయన్నారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. మనగుడి మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: విభిన్న ప్రతిభావంతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. తన నివాసం వద్ద గురువారం కొంతమూరుకు చెందిన టి.సురేష్, ఆర్.భాను, వై.కిరణ్‌లకు ట్రై సైకిళ్లు, డి.శివకీర్తి, కోలమూరు గ్రామానికి చెందిన పి.రాజులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసి పూజ



వేంకటేశ్వరస్వామి అలంకరణలో జనార్దనుడు

ధవళేశ్వరం: ధనుర్మాసం సందర్భంగా ధవళేశ్వరంలోని ధవళగిరిపై కొలువైన లక్ష్మీజనార్దనస్వామి ఆలయంలో గురువారం లక్షతులసి పూజను వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్వామివారిని వేంకటేశ్వరస్వామిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకులు ఎస్‌వీఎస్ఎన్ ఆచార్యులు (కాసులు), పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



అసంపూర్తిగా నిలిచిన వసతి గృహ భవనం



ప్రహరీ లేని హాస్టల్ భవనం

సమస్యల చెర

- జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల అవస్థలు
- కానరాని ఇంటర్నల్ రోడ్లు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులకు ఉన్నత విద్యను బోధించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రస్తుతం సమస్యల చెరలో చిక్కుకుంది. వసతుల లేమితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కళాశాలలో రూ.2 కోట్లతో 2018లో ప్రారంభించిన నూతన వసతి గృహ భవనం ఇప్పటి వరకూ పూర్తి కాలేదు. ఇంటర్నల్ రోడ్లు లేకపోవడం, ఆడిటోరియం, వర్కుషాపుల శ్లాబులకు లీకులు ఏర్పడడంతో ఇక్కట్లు తప్పడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అడ్మినిస్ట్రేటివ్, విద్యార్థుల తరగతి గదులు, లైబ్రరీ మరమ్మత్తులకు రూ.1.70 కోట్లు మంజూరు చేయడంతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

1987లో ప్రారంభం

ఎస్సీ విద్యార్థులకు కోసం బొమ్మూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను 1987లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నెలకొల్పారు. దీనిలోని ఈసీఈ, డీఎంఈ, డీసీఎంఈ కోర్సులతో ఏడాదికి 180 మంది విద్యార్థులు చదువుకోవచ్చు. ప్రస్తుతం కళాశాలలో 540 మందికి గాను 412 మంది విద్యార్థులు ఉన్నారు.



అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, తరగతి గదులకు జరుగుతున్న మరమ్మతులు

అసంపూర్తిగా..

పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం 2018 మే నెలలో అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి రూ.2 కోట్లతో నూతన వసతి గృహ భవనానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఈ భవనం అసంపూర్తిగానే ఉంది. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీన్ని ఇలాగే వదిలేస్తే శిథిలమయ్యే ప్రమాదం ఉందని పలువురు చెబుతున్నారు. అలాగే కళాశాలలోని ఆడిటోరియం, వర్కుషాపులకు లీకేజీల కారణంగా మరమ్మతులు చేయాల్సి వస్తుంది. భారీ వర్షం కురిస్తే లీకేజీల వల్ల లోపలకు నీరు వచ్చి చేరుతోంది. దీనివలన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

ఇంటర్నల్ రోడ్లు లేక..

కళాశాల ఆవరణలో ప్రధానంగా మట్టి రోడ్డు ఒక్కటే ఉంది. అది ప్రధాన ద్వారం నుంచి హాస్టల్ భవనం వరకూ ఉంటుంది. ఇక ఎటువంటి ఇంటర్నల్ రోడ్లు లేవు. దీంతో విద్యార్థులు కళాశాల ఆవరణలో పెరిగిపోయిన పిచ్చిమొక్కల మధ్యలోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే కళాశాల, ప్రస్తుతం ఉన్న హాస్టల్ భవనానికి పూర్తిస్థాయిలో ప్రహరీలు లేవు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రాత్రి సమయంలో బయటి వ్యక్తులు కళాశాల ఆవరణలోకి ప్రవేశించి మద్యం తాగుతున్నారు. క్రీడా మైదానంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి అస్తవ్యస్తంగా తయారైంది.

రూ.1.70 కోట్లతో అభివృద్ధి పనులు

కళాశాల అడ్మినిస్ట్రేషన్ భవనం, తరగతి గదులు, లైబ్రరీ మరమ్మత్తుల కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.1.70 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటిని ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



కళాశాల, హాస్టల్ భవనానికి ప్రహరీ లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆడిటోరియం, వర్కుషాపు లీకేజీ అవుతున్నాయి. ఇంటర్నల్ రోడ్లు కూడా లేవు. ఈ సమస్యలపై ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, టెక్నికల్ ఎడ్యుకేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

– వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్

రోల్ మోడల్ కళాశాలగా తీర్చిదిద్దుతాం

ఇటీవల జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజినల్ మీట్ ముగింపు సభలో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు. కళాశాలలో అవసరమైన వసతులకు ప్రిన్సిపాల్ ప్రతిపాదనలు ఇచ్చారని, వాటిని రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులను మంజూరు చేయాలని కోరామన్నారు. క్రీడా మైదానంలో తుప్పల తొలగింపునకు స్వీయ నిధులు రూ.లక్ష, జేసీబీని ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ఒక రోజు శ్రమదానం చేయాలని సూచించారు.

భరత్ రామ్‌ను విమర్శించడం తగదు

- యిన్నమూరి దీపు తీరు మారాలి
- వైఎస్సార్ సీపీ నాయకురాలు అను యాదవ్ ఆగ్రహం

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను విమర్శించేస్థాయి టీడీపీ నాయకుడు దీపు యిన్నమూరికి లేదని వైఎస్సార్ సీపీ నాయకురాలు అను యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యిన్నమూరి దీపు ఊసరవెల్లిలా రంగులు మారుస్తాడని అనుకోలేదన్నారు. భరత్ రామ్ చెంతకు చేరిన సమయంలో ఆయన వెంట ఉంటానని, ప్రజాసేవ చేస్తానని చెప్పారన్నారు. దీంతో భరత్ రామ్ ఆయనను చేరదీసి ఉమా మార్కండేయేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. అయితే పాలు పోసిన చేతినే కాటు వేసిన చందంగా భరత్ రామ్‌పై దీపు విమర్శలు చేస్తున్నారన్నారు. భరత్ రామ్ ప్రజల మనిషి అని, ఆయన పాలనలో నగరం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అను యాదవ్

టీడీపీ నాయకుల ఆరోపణలు సరికాదు



మల్లికార్జున ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని గౌతమీ సూపర్ బజార్ స్థలం లీజు విషయంలో బురదజల్లడాన్ని టీడీపీ నేతలు ఆపాలని వైఎస్సార్ సీపీ నాయకుడు వడ్డి మల్లికార్జున ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్‌పై అసత్య ఆరోపణలు చేయడం, పోస్టర్లు వేయడం టీడీపీ నాయకులకు తగదన్నారు. సహకారశాఖ పరిధిలోని సూపర్ బజార్‌కు ప్రసాదుల హరనాథ్ చైర్మన్‌గా ఉన్న సమయంలో సదరు ఖాళీ స్థలాన్ని లీజుకి ఇస్తే ఆదాయం సంస్థకు వస్తుందని కమిటీ నిర్ణయించిందన్నారు. దానికి ఆరుగురు కాంట్రాక్టర్లు టెండర్లు వేయడంతో ఎక్కువ కోట్ చేసిన కోనసీమకు చెందిన వ్యక్తి నుంచి రూ.5 లక్షల ఈఎండీని నాన్ రిఫండబుల్ డిపాజిట్‌గా తీసుకుని, నెలకు రూ.52 వేలకు లీజుకు ఇచ్చారన్నారు. సూపర్ బజార్‌కు చెందిన స్థలం 400 గజాల పైచిలుకు ఉండగా, 2023లోనే రోడ్డు విస్తరణలో దానిలో కొంత స్థలం పోగా 370 గజాలు మిగిలిందన్నారు. దేవీచౌక్‌లోని మార్కెట్ విలువ ప్రకారం ఆ స్థలం 3.70 కోట్లు మాత్రమే ఖరీదు చేస్తుందన్నారు. దాని కోసం రూ.ఐదు కోట్లు లంచం తీసుకున్నారని ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు.

సమాజంలో పీఎంపీల పాత్ర చాలా కీలకం

కంబాలచెరువు: పీఎంపీల పాత్ర సమాజంలో చాలా కీలకమని ప్రముఖ డాక్టర్, అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ – ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం పీఎంపీ 62వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అధ్యక్షతన రెడ్డీస్ కన్వెన్షన్ హాల్లో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా కార్యదర్శి పి.దేవానందం స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య సంరక్షణకు పీఎంపీలు చేస్తున్న కృషిని అభినందించారు. జిల్లా అడ్మిన్ ఎస్పీ ఎస్‌బీఎం మురళీకృష్ణ మాట్లాడుతూ పేదల వైద్యులుగా పీఎంపీలు పేరు తెచ్చుకోవాలన్నారు. తొలుత రాజేంద్ర నగర్‌లోని జిల్లా సంఘ కార్యాలయంలో వ్యవస్థాపకుడు ఆర్కే భరద్వాజ విగ్రహానికి జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, జాతీయ ఉపాధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుమళ్ల రాంబాబు, జిల్లా నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్డీస్ కన్వెన్షన్ హాల్లో జరిగిన సదస్సులో గౌతమ్ యూరాలజీ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ గౌతమ్ రెడ్డి అధునాతన వైద్య విధానాలు, ప్రోస్టేట్ సమస్యలపై ప్రసంగించారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు, డాక్టర్ సుగుణేశ్వరి, రాష్ట్ర గౌరవ సలహాదారు కోన చిన్నారావు, జిల్లా ఉపాధ్యక్షులు రహమాన్ ఖాన్, గౌరవ అధ్యక్షులు బుడ్డిగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు. సదస్సులో హాజరైన వైద్య నిపుణులను సభ్యులు ఘనంగా సత్కారించారు. జిల్లా కోశాధికారి పి.చిన్ని వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

చెత్తను తొలగించారు



ధవళేశ్వరంలోని కాటన్‌పేట ఇత్తడి ఫ్యాక్టరీ ప్రాంతంలో తొలగించిన చెత్త

సాక్షి ఇంపాక్ట్

ధవళేశ్వరం: గ్రామంలో పేరుకుపోయిన చెత్త తొలగింపునకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. డంపింగ్ యార్డులుగా మారిన వీధుల్లో చెత్తను సోమవారం పంచాయతీ కార్మికులు తొలగించారు. ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి, పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకున్నారు. కాగా. గ్రామంలో అధ్వానంగా మారిన పారిశుధ్యంపై సాక్షి పత్రికలో మేజర్‌లో డేంజర్ శీర్షికతో కథనం వచ్చిన విషయం తెలిసిందే. దానిపై పంచాయతీ అధికారులు వెంటనే స్పందించారు.

మోహనరంగా ఆశయ సాధనకు కృషి

- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వంగవీటికి వాడవాడలా నివాళి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వంగవీటి మోహనరంగా ఆశయాల సాధనకు కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక ట్రెనింగ్ కళాశాల వద్ద రాధారంగా మిత్ర మండలి అధ్యక్షుడు వడ్డి మురళీ ఆధ్వర్యంలో గురువారం వంగవీటి మోహనరంగా వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నగర మాజీ అధ్యక్షుడు నందెపు శ్రీనివాస్, ట్రేడ్ యూనియన్ నాయకులు గెద్దం రమణ, ఇసుకపల్లి శ్రీనివాస్, మద్దాల రవి పాల్గొన్నారు. వడ్డి మురళీ మాట్లాడుతూ తన రాజకీయ గురువు, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సూచనల మేరకు ఇక్కడ రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు.

పేదలకు పండ్లు పంపిణీ

సీటీఆర్ఐ: వంగవీటి రంగా వర్ధంతిని పురస్కరించుకుని దేవీచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో నగర అధ్యక్షుడు విన్నా వాసు ఆధ్వర్యంలో పేదలకు, కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటిపల్లి వెంకట రామారావు హాజరయ్యారు. ఉమ్మడి గోదావరి జిల్లాల అధ్యక్షుడు గుదే రఘు నరేష్, పార్లమెంట్ అధ్యక్షుడు ముమ్మిడి వీరబాబు, రూరల్ అధ్యక్షుడు దేశినీడి రాంబాబు పాల్గొన్నారు.



రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జక్కంపూడి రాజా, ఆకుల వీర్రాజు తదితరులు

కడియం మండలంలో..

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో రంగా వర్ధంతి నిర్వహించారు. కడియంలో రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తాడాల విష్ణుచక్రవర్తి, ఆదిమూలం సాయిబాబా, కళ్యాణపు సూరిబాబు, గిరజాల చినబాబు పాల్గొన్నారు.జేగురుపాడు వేపచెట్టు సెంటర్ వద్ద రంగా యువసేన ఆధ్వర్యంలో వంగవీటి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. వైఎస్సార్ సీపీ కడియం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, ఎంపీటీసీ ఆకుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. వీరవరంలో ఆయన విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు పుష్పాంజలి ఘటించారు. విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పార్కులో పిల్లలకు జారుడుబల్ల, ఉయ్యాల తదితర ఆట వస్తువులను ప్రారంభించారు. బత్తు రాము, ఆదిమూలం సాయిబాబా, ఆదిమూలం పెద్దబ్బు, వట్టికూటి బాబులు, కేదారి శ్రీనివా పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం

ధవళేశ్వరం: బాలికోన్నత పాఠశాల సమీపంలోని రంగా విగ్రహం వద్ద రాధా రంగా మిత్రమండలి సభ్యుడు, మాజీ ఉపసర్పంచ్ మెండా సత్తులు ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఏపీ కాపు జేఏసీ చైర్మన్ జేటీ రామారావు, సాధనాల చంద్రశేఖర్ (శివ), మెండా రాజేష్, శ్రీరంగం బాలరాజు, ఆళ్ల ఆనందరావు, ముత్యాల పోసికుమార్, ముద్దాల అను పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాధారంగా మిత్ర మండలి సభ్యులు



కడియంలో పుష్పాంజలి ఘటిస్తున్న రంగా మిత్రమండలి



దేవీచౌక్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న కాపు నాడు నాయకుడు

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల కోసం శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాలలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కొంతమూరులోని ఎస్ఎస్ఆర్ఆర్ లేఅవుట్, సున్నంబట్టీ రోడ్డు, రాజరాజేశ్వరి నగర్, నూకాలమ్మ ఆలయ ప్రాంతం, అఫీషియల్ కాలనీ, చందన రమేష్ లేఅవుట్, చెంచు కాలనీ, విడో కాలనీ, తేజానగర్, భవానీ పురం, సంతోష్ నగర్, శానిటోరియం ఏరియా, ఆర్టీఓ ఆఫీస్, నారాయణపురం, రెవెన్యూ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, శ్రీకృష్ణ నగర్, గాయత్రీ నగర్, పోస్టల్ కాలనీ, లాలా చెరువు జంక్షన్, భాగ్యనగర్ ఏరియాల్లో విద్యుత్ ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సీతంపేట, మూలగొయ్యి సెంటర్, రామాలయం ఏరియా, ఎన్టీఆర్ కాలనీ ఏరియాలలో అంతరాయం కలుగుతుంది.

ఏసుక్రీస్తు బోధనలతో ప్రపంచ శాంతి



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జాన్‌వెస్లీ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఏసుక్రీస్తు బోధనలను అనుసరిస్తే ప్రపంచ శాంతి సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ ఏపీస్టేట్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. కొంతమూరులోని హోప్‌ఇన్ క్రైస్ట్ మిషన్ వారి క్రీస్తు నిరీక్షణ ఆలయంలో సంఘ కాపరి విజయసారథి ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జాన్‌వెస్లీ మాట్లాడుతూ క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మన అందరి పాపాల కోసం ఏసుక్రీస్తు శిలువ మీద మరణించారన్నారు. విజయ సారథి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో దేవుని సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సుకుమార్ మాట్లాడుతూ క్రైస్తవ్యం అంటేనే ఇతరులకు మంచిని పంచడమన్నారు. అనంతరం జాన్‌వెస్లీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యువతీ యువకుల క్రైస్తవ గీతాలాపన ఆకట్టుకుంది. కార్యక్రమంలో తిమోతీ, జీఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత గాలి సుబ్బరాజు, సుదర్శన్ మాల్ అధినేత సుదర్శన్ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కడియం: దామిరెడ్డిపల్లిలోని బైబిల్ మిషన్ మహిమ మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సిస్టర్ ఏనిప్రియదర్శిని సందేశాన్నిస్తూ క్రిస్మస్‌లో దాగిఉన్న ఏడు దైవ ఆశీర్వాదాలను ఉపదేశించారు. మహిమ మందిరం యాజకులు డి.రత్నరాజు నిర్వహణలో జరిగిన ఈ వేడుకల్లో సీహెచ్ పాల్ దొరబాబు ప్రారంభ ప్రార్థన చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ సెక్రటరీ సీహెచ్ రత్నదీప్ అధ్యక్షతన రాజమహేంద్రవరం రూరల్ ఏబీసీసీ అధ్యక్షుడు కె.జయశీల్, అపోస్తలిక్ బైబిల్ మిషన్ చర్చి వ్యవస్థాపకుడు బండి అబ్రహం శుభాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



దామిరెడ్డిపల్లిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

వైద్యాధికారులకు పదోన్నతులు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎన్.రాజకుమారి, రాజమహేంద్రవరం డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీహరిబాబులకు గురువారం పదోన్నతి లభించింది. రాజకుమారిని కాకినాడ జనరల్ ఆసుపత్రి సివిల్ సర్జన్ రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్‌గాను, శ్రీహరిబాబును శ్రీకాకుళం జిల్లా పలాసలోని కిడ్నీ స్పెషాలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు సివిల్ సర్జన్ రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్‌గాను నియమించారు. వారిని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందించారు.

సినిమాలు



శ్యామల	: మ్యాక్స్
సూర్యమినీ	: ముఫాసా
సూర్యప్యాలెస్	: యుఐ
స్వామి	: ముఫాసా
శివజ్యోతి	: పుష్ప–2
అనుశ్రీ	: శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్
రాజా	: పుష్ప–2
ఊర్వశి	: డ్రింకర్ సాయి
మేనక	: బేబీ జాన్
రంభ	: ముఫాసా
కుమారి	: ముఫాసా
అప్సర	: పుష్ప–2
అశోక నామవరం	: బచ్చలమల్లి
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: పుష్ప–2
మురళీకృష్ణ కడియం	: పుష్ప–2
వెంకటసూర్య	: ముఫాసా, పుష్ప–2